సాక్షి
కుమురం భీం

శనివారం : 14 : జనవరి : 2023



రెడీమేడ్ పిండివంటలు
ఉమ్మడి జిల్లాలో స్వగృహ ఫుడ్ సెంటర్లకు భలే క్రేజ్ ఏర్పడింది. ఆర్డర్లపై పిండి వంటలను తెలంగాణ, మహారాష్ట్ర పట్టణాలతోపాటు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 8లో▸



అటవీ సిబ్బంది కొరత
కెరమెరి రేంజ్ పరిధిలో అటవీ శాఖ సిబ్బంది కొరత వేధిస్తోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన కలప అడవుల నుంచి తరలిపోతోంది. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6 /17.4

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

తేనెశుద్ధి కేంద్రం సందర్శన



యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనెశుద్ధి కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ప్రణాళిక అధికారి బి.రవీందర్ సందర్శించారు. తేనె సేకరణ, శుద్ధి చేసే విధానం, మార్కెటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని సీఎఫ్‌సీ పరిశ్రమను పరిశీలించి, అక్కడ చేపడుతున్న పనులు, ఇతరాత్ర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీఎం రామక్రిష్ణ, ఏపీఎం మహేశ్, సీసీలు భీంరావు, విఠల్, వేణుగోపాల్, సురేందర్, శ్యాంరావు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



జంగాంలోని హనుమాన్ మందిరంలో పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నార్నూర్/కెరమెరి: ఆధ్యాత్మిక మార్గంలోనే నడిచినప్పుడే ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జైనూర్ మండలం జంగాంలోని ఘాట్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉషేగాం సర్పంచ్ ఉయిక రమకాంత్– సావిత్రీబాయి దంపతులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జై జంగో లింగో దీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను ఆదివాసీ స మాజం ఎప్పటికీ మరిచిపోవద్దన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు, ఎంపీడీవో ప్రభుదయ, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, జెడ్పీటీసీ పెడ్మాకా దుర్పతాబాయి, నాయకులు భగవంత్‌రావు, శ్యాంరావు, రాము, పూసం మారుతి, కుమ్ర విశ్వనాథ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో జిల్లాను ముందుంచాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగంలో జిల్లాను ముందుంచాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి ఎంఈవోలు, ఎంఎస్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వందశాతం బయోమెట్రిక్ అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడిబయట పిల్లల గుర్తింపు సర్వే పకడ్బందీగా నిర్వహించి, పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ మండల విద్యాధికారులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కోఆర్డినేటర్లు సత్యనారాయణ మూర్తి, సత్తయ్య, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి..

- జిల్లాలో సంబురాలు షురూ..
- సందడిగా మారిన పల్లెలు
- నేడు భోగి, రేపు సంక్రాంతి పండుగ



జిల్లా కేంద్రంలో రంగుల కొనుగోళ్లు



కెరమెరిలో పిండి వంటలు చేస్తున్న మహిళలు, యువతులు



జిల్లా కేంద్రంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్: రంగవల్లులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, పిండి వంటలతో పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఉద్యోగులు, విద్యార్థులు స్వగ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో పిండి వంటలు, అరిసెలు, సకినాలు, స్వీట్లు తయారు చేస్తున్నారు. కొత్త అతిథులతో ప్రతీ ఇంట్లోనూ ప్రత్యేక శోభ కనిపిస్తోంది. కొత్త ల్లుళ్లు, దూర ప్రాంతాలలో ఉండే ఆప్తుల రాకతో పల్లెలు కళకళలాడుతున్నాయి. మూడు రోజులపాటు సంబురాలు కొనసాగనున్నాయి. శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం కనుమ జరుపుకోనున్నారు. వేకువజామున నిద్రలేచి తలస్నానాలు చేసి, భోగి మంటలు వెలిగించడంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిన్నారులకు బియ్యం, నువ్వులు, రేగుపండ్లు, చిల్లర నాణేలు కలిపి భోగి పండ్లు పోస్తారు. గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.

ముగ్గులు.. వంటలు

సంక్రాంతి అనగానే సకినాలు, గారెలు, అరిసెలు, లడ్డూలు, ఇతర పిండి వంటలే గుర్తుకొస్తాయి. ఇళ్లల్లో చకినాల ఘుమఘుమలు వెదజల్లుతున్నాయి. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెనతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉమ్మడి కుటుంబాల సంస్కృతి ఇప్పటికీ ఉంది. సుమారు పది రోజుల ముందు నుంచే పిండి వంటలు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. కొత్త సంవత్సరం నుంచే ఇళ్ల ముందు ముత్యాల ముగ్గులు దర్శనమిస్తున్నాయి. వాటిని ఆవుపేడ గొబ్బెమ్మ, రేగుపళ్లు, నవధాన్యాలు, గరిక, పూలతో అలంకరిస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని మార్కెట్ పల్లెల నుంచి వచ్చే కొనుగోలు దారులతో రద్దీగా మారింది. పండుగకు కొత్తగా పెళ్లి అయిన వారు నోములు నోచుకోవడం సంప్రదాయంగా వస్తోంది. చిన్నారులు దుకాణాల్లో రంగురంగుల పతంగులు విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో వంటకాలకు అవసరమున్న నువ్వులు, నూనె, బెల్లం, బియ్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. కోడి పందెలపై ఆంక్షలు విధించినప్పటికీ రహస్యంగా నిర్వహించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వ్యాపారం పుంజుకుంది



సంక్రాంతి పండుగ సందర్భంగా లేడీస్ ఎంపోరియం విక్రయాలు పెరిగి వ్యాపారం పుంజుకుంది. సాధారణ రోజుల కంటే మహిళలు వివిధ వస్తువుల కొనుగోలు ప్రతిరోజూ వస్తున్నారు. ముత్తైదువలు నోముల కోసం కావాల్సిన వస్తువులు ఎక్కువగా సేల్ అవుతున్నాయి. కరోనా సమయంలో పండుగ గిరాకి లేకుండే. కస్టమర్ల కోసం హైదరాబాద్ నుంచి వస్తువులు తెప్పిస్తున్నా.

– తూమోజు ఉమ,
లేడీస్ ఎంపోరియం, ఆసిఫాబాద్

సొంతూరికి వస్తా



ఉద్యోగ రీత్యా లక్సెట్టిపేట మండలం గూడెంలో ఉంటాం. ఏటా సంక్రాంతి పండుగకు సొంతూరు ఆసిఫాబాద్‌కు వస్తాం. అమ్మగారి ఇంట్లో పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంట్లో చేసిన సకినాలు అందరితో కలిసి తినడం గొప్ప అనుభూతి.

– ముద్దు స్వప్న, ఆసిఫాబాద్

సూర్యుడి పండుగగా..



బెంగాలీలు సంక్రాంతిని సూర్యుడి పండుగగా జరుపుకుంటారు. సూర్యదేవుడి కి నమస్కరిస్తూ మొక్కుకుంటారు. ఉదయం వాస్తుపూజ నిర్వహించి దీపాలు ముట్టించి పూజ చేస్తాం. పిండి వంటలు చేసి ఆనందంగా గడుపుతాం.

– తపన్ మండల్,
రవీంద్రనగర్, మం.చింతలమానెపల్లి

స్థానికులతో ఆనందంగా..



మా సంస్కృతి మేరకు పండుగను సంప్రదాయంగా నిర్వహిస్తాం. స్థానికులతో కలిసి పండుగను జరుపుకుంటాం. ఇక్కడి ఆచారాలకు తగినట్లుగా సంక్రాంతి మార్పు చెందింది. సాయంత్రం మంటలు వెలిగించి కుటుంబం, మిత్రులతో ఆనందంగా గడుపుతాం.

– సమీర్ మండల్, ఈస్‌గాం, మం.కాగజ్‌నగర్

సంప్రదాయాలు కాపాడుకుందాం



ప్రతీ పండుగకు సంప్రదాయ పరంపర, శాస్త్రీయత ఉంటుంది. సంప్రదాయాలను కాపాడుకుంటూ భావి తరాలకు అందించాలి. చిన్నారులకు బొడబొడ పోకలు పోయాలి. దీని ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని చెబుతారు. సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ విశిష్టతను కాపాడాలి.

– నీల కళావతి, ఆసిఫాబాద్

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్(సిర్పూర్): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువకుల్లో ప్రతిభకు కొదువ లేదన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎస్సై విజయ్‌కుమార్, సర్పంచులు దేవాజీ, సంజీవ్, నాయకులు రాజన్న, శ్రీనివాస్, ఎస్‌కే బాబు, సత్తన్న, బండన్న, నిర్వాహకులు మోయిన్, శశి, అంజి, సాయి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే సక్కుకు వినతిపత్రం అందజేస్తున్న భక్తులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం ఖమాన గ్రామంలోని సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పలువురు భక్తులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ధ్యాన కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బాబా భక్తుల సౌకర్యార్థం కేంద్రం వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రవీణ్, మాజీ సర్పంచ్ ప్రకాశ్, భక్తులు బాపురావు, విలాస్, భీంరావు, శంకర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

26 బృందాలతో 'కంటి వెలుగు'

- సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ కోసం 26 బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కంటి వైద్యులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర శాఖల అధికారులతో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18న ఖమ్మంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో వైద్యశిబిరాలు నిర్వహించే భవనాలను సభ్యులు ముందుగానే పరిశీలించి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు నిర్వహించాలని, శిబిరాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. పంచాయతీ కార్యదర్శులు వైద్యాధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. శిబిరాలకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులతో స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డెప్యూటీ డీఎంహెచ్‌వోలు సుధాకర్‌నాయక్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులెవరు..?

- కేయూ డిగ్రీ పరీక్షల్లో జోరుగా చూచిరాత
- మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నదెవరో..?
- సెంటర్ల కేటాయింపు నుంచి అన్నీ అనుమానాలే
- కట్టడికి యత్నించిన అధికారులపై దాడులు, బెదిరింపులు
- దారి తప్పుతున్న విద్యార్థిలోకం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదలైన కేయూ (కాకతీయ యూనివర్సిటీ) డిగ్రీ పరీక్షల్లో చూచిరాతల పర్వం జోరుగా సాగుతోందనే విమర్శలున్నాయి. రోజురోజుకు డిబార్ అవుతున్న విద్యార్థుల సంఖ్యనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫలితాలను పెంచుకునేందు కోసం మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తీర్ణత శాతం తగ్గితే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందనే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల వరుసగా విద్యార్థులు పట్టుబడటం ఒకటైతే, డిబారైన వారు ఏకంగా ఫ్లయింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లను బెదిరించడం, దాడులకు దిగడం విస్మయానికి గురిచేస్తోంది.

బోధనను మరిచి.. కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తూ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను మౌలిక వసతులు, అధ్యాపకులు లేకుండానే నిర్వహిస్తున్నారు. ఇలాంటి యాజమాన్యాలు విద్యా సంవత్సరం ప్రారంభంలో తమ కళాశాలలో చేరితే పాస్ గ్యారంటీ అంటూ విద్యార్థులకు ఆశ చూపుతున్నాయి. కాలేజీకి వచ్చినా, రాకపోయినా పాస్ చేయించే బాధ్యత తమదంటూ చెప్పి అడ్మిషన్లు చేసుకుంటున్నారు. వారికి తరగతులు బోధించడం లేదు. అలాంటి విద్యార్థులను ఎలాగైనా పాస్ చేయించాలనే ఉద్దేశంతో ఆయా యాజమాన్యాలు అడ్డదారి తొక్కుతున్నాయి. అనుకూలమైన కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయించుకుంటున్నాయి. ఇందుకు రాజకీయ అండదండలు సైతం వారికి కలిసివస్తున్నట్లు తెలుస్తోంది. తెలిసిన సెంటర్‌లోని ఇన్విజిలేటర్లు చూసీచూడనట్లు ఉండేలా వారికి ముడుపులు ముట్టజెప్పి కాపీయింగ్‌కు తెరలేపుతున్నట్లు సమాచారం.

- మూడు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థిని నుంచి చీటీలు గుర్తించిన ఇన్విజిలేటర్ వాటిని తీసుకోగా.. తనపై అనుచితంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అసలు విషయం తెలుసుకున్న పోలీసులు సదరు విద్యార్థినిని మందలించడంతో వివాదం సద్దుమణిగింది.
- ఈ నెల 11న ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న 20 మంది విద్యార్థులను ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని డిబార్ చేసింది. దీన్ని తట్టుకోలేని కొందరు సదరు బృందం ప్రయాణిస్తున్న వాహనంపై దాడికి పాల్పడటం గమనార్హం.

కేయూ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమాచారం..

మొత్తం డిగ్రీ కళాశాలలు	137
విద్యార్థులు	38,674
ఉమ్మడి జిల్లాలో కేటాయించిన పరీక్ష కేంద్రాలు	50

అడ్డుచెబితే బెదిరింపులు, దాడులు

కొన్ని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి కాపీయింగ్ కట్టడిని సహించడం లేదని తెలుస్తోంది. పరీక్షల పర్యవేక్షణ అధికారులే వరైనా చూసీచూడనట్లు ఉంటే సరి.. లేదంటే వారిపై దాడులు, బెదిరింపులకు దిగేలా విద్యార్థులను ఉసి గొల్పుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఏదైనా జరిగితే తాము చూసుకుంటామంటూ ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జిల్లాలోని ఇచ్చోడ, ఉట్నూర్‌తో పాటు ఆదిలాబాద్‌లో జరిగిన ఘటనలే ఇందుకుని దర్శనం. కష్టపడి చదివి పరీక్షలు రాసి ప్రయోజకులుగా మారాల్సిన విద్యార్థులు ప్రైవేట్ యాజమాన్యాల వలలో చిక్కుకుని తమ భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'ఉమ్మడి ఆదిలాబాద్'లోనే ఎక్కువగా..

కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో మొ త్తం 120 మంది డిబార్ కాగా ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే వంద మంది వరకు ఉన్నారు. కోవిడ్ నుంచే ఈ పరిస్థితి ఎక్కువైంది. కళాశాలల్లో తరగతులు జరగకపోవడంతో విద్యార్థులు నకల్‌పై ఆధారపడుతున్నారు. కష్టపడి చదివి పరీక్ష రాయాలే తప్ప ఇలాంటి వాటిపై ఆధారపడకూడదు. అధికారులపై దాడులు, బెదిరింపులకు పాల్పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. మాస్ కాపీయింగ్ కట్టడికి ప్రతి పరీక్ష కేంద్రానికి ఓ అబ్జర్వర్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం.

– ఎర్రోల్ల నరేందర్,
కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్

అమ్మా.. కరుణించు!





కెరమెరి మండలం దనోరా గ్రామ సమీపంలో కొలువైన జంగుబాయి అమ్మవారి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్రం గోత్రానికి చెందినవారు మొక్కులు చెల్లించుకున్నారు. కటోదాలు ఆత్రం మారు, భీము, జైతు జెండా ఆవిష్కరించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆలయం ఎదుట సంప్రదాయ నృత్యాలు చేశారు.

– కెరమెరి

క్లుప్తంగా

బాలికను వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

జన్నారం: బాలికను వేధించిన కేసులో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు, రూ.5000 జరిమానా విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి మైత్రేయి తీర్పునిచ్చారు. జన్నారం ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన తుడుం సుధాకర్ మండలానికి చెందిన బాలికకు ప్రేమ పేరిట వేధించాడు. 2019 అక్టోబర్‌లో బాలికల తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై వినోద్‌కుమార్ కేసు నమోదు చేసి సుధాకర్‌ను కోర్టులో హాజరుపర్చారు. ఎస్సై మధుసూదన్‌రావు చార్జీషీట్ దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేందర్ ఉపాధ్యాయ సాక్ష్యాలతో నేరాన్ని నిరూపించగా తీర్పు వెలువడిందని ఎస్సై వివరించారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంపల్లి గ్రామ శివారులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని కంప్యూటర్ గత ఏడాది చోరీకి గురైంది. కేసు నమోదు మేరకు నిందితుడిని గుర్తించి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పరుచగా నేరం రుజువైంది. మధ్యప్రదేశ్‌లోని బింజల్‌గామ్‌కు చెందిన ఓంప్రకాశ్ జీవ్‌టోడేకు న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్ రెండు నెలల తొమ్మిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు విచారణ అధికారి హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ, ఏపీపీ సహేన్ సుల్తానా, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్‌లను న్యాయమూర్తి అభినందించారు.

దేశీదారు పట్టివేత



నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

రెబ్బెన: మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద అక్రమంగా రవాణ చేస్తున్న రూ.1.5 లక్షల విలువ గల దేశీదారు పట్టుబడినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్34బిబి1387 నంబరు గల కారుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన టీఎస్02ఈయు2359 నంబరు పెట్టుకుని జిల్లాలోని వివిధ బెల్టు షాపులకు దేశీదారు అక్రమంగా రవాణ చేస్తున్నారని సమాచారంతో తనిఖీలు చేపట్టి కారును పట్టుకున్నారు. అందులో 30 దేశీదారు కాటన్లు, 3000 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని తెలిపారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన అజేయ్ రాకేష్ కంజర్, రోహిత్ సింఘా, సుభాష్‌లను అదుపులోకి తీసుకుని నిందితులను, వాహనాలను, దేశీదారును రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

రెడీమేడ్ పిండివంటలు

- ఆర్డర్లపై సిద్ధం చేస్తున్న వైనం
- ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు ఎగుమతులు
- ఉపాధి పొందుతున్న పలువురు మహిళలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్వగృహ ఫుడ్ సెంటర్లు
- సంక్రాంతి సందర్భంగా భలే గిరాకీ



నిర్మల్‌లో చకినాలు చేస్తున్న మహిళలు

సంక్రాంతి అనగానే మొదటగా గుర్తొచ్చేది రంగవళ్లులు, పిండివంటలే. ప్రతీ ఇంట్లో పలురకాల ఘుమఘుమలాడే పిండివంటలు సిద్ధం చేసుకోవడం మనకు తెలిసిందే. అయితే ప్రస్తుతం మారుతున్న జీవనశైలి పిండివంటలను చేసుకునే అలవాటును తగ్గించి ఆర్డర్‌పై తెచ్చుకునే దిశగా మారిపోయింది. పలువురు సమయాభావంతో ఆర్డర్లపై పిండివంటలను సిద్ధం చేయించుకుంటుండడంతో మరొకరికి ఉపాధిగా మారుతోంది. సంక్రాంతికి పిండివంటల గిరాకీ ఎక్కువగా ఉండడంతో పలువురికి చేతినిండా పని దొరుకుతోంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్వగృహ ఫుడ్ సెంటర్లకు భలే క్రేజ్ ఏర్పడింది.



ఆదిలాబాద్‌లో పిండి వంటలు సిద్ధం చేస్తున్న మహిళ



అరిసలు

చకినాలు

బొబ్బట్లు

నిర్మల్‌లో స్వగృహ ఫుడ్స్‌కు క్రేజ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలోనీ శ్రీగాయత్రి స్వగృహ ఫుడ్స్ వారు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు, విదేశాలకు సైతం కొరియర్ ద్వారా ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఈ స్టాల్ వద్ద జనం బారులు తీరుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 1 నుంచి రోజుకు సుమారు 70కిలోల చకినాలను రిటైల్‌గా విక్రయించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 20 రకాల పిండివంటలను అందుబాటులో ఉంచామని, దేనికైనా కిలోకు రూ.260 నుంచి 300లకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే నగరంలో పలుచోట్ల స్వగృహ పిండివంటలను తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఆదిలాబాద్‌లో...

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో పలు స్వగృహ సెంటర్లు వెలిశాయి. దీంతో కొందరు ఆర్డర్లపై పిండివంటలు తీసుకుపోతుండడంతో సంక్రాంతి వంటలతో పలువురు ఉపాధి పొందుతున్నారు. జిల్లాతో పాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు సైతం సరఫరా చేస్తున్నారు. కిలోకు రూ.200 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు.

మంచిర్యాల నుంచి విదేశాల వరకు..



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో స్వీట్ హౌజ్ సెంటర్ల వారు తమ గోదాముల్లో పిండి వంటలను బారి ఎత్తున తయారు చేస్తున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రత్యేక వంటవాళ్లను పిలిపిస్తున్నారు. కొందరు ఇంటివద్ద దీనిని చిన్న వ్యాపారంగా మార్చుకొని హోంఫుడ్ సెంటర్లకు ఇస్తున్నారు. అలాగే ఇక్కడి నుంచి విదేశాలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లే పిల్లల కోసం.. బంధువులు, స్నేహితులకు ఇక్కడి నుంచి సంక్రాంతికి పిండిడి వంటలు (హోం ఫుడ్స్) కొనుగోలు చేసి పంపిస్తున్నారు.

మంచిర్యాలలో ధరలు ఇవిగో...

కిలోకు	ధరలు
సకినాలు	- రూ. 320
కారపూసలు	- రూ320
గారెలు-	రూ300 -350 వరకు
బెల్లం అరిసెలు	-రూ.400
బూరెలు	- రూ. 450- 500 వరకు

విదేశాలకు సైతం....



అధికారులు, వ్యాపారస్తులు పిండి వంటలను ఆర్డర్లు ఇవ్వడానికి ముందుకు వస్తుంటారు. దీంతో ఆర్డర్ల సంఖ్య పెరుగుతోంది. ఎనిమిదేళ్లుగా పిండి వంటలు చేస్తున్నాను. నిర్మల్, హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి సైతం వినియోగదారులు వస్తుంటారు. సంక్రాంతి, దీపావళి, దసరా వంటి సమయాల్లో అమెరికా వంటి విదేశాలకు సైతం పంపుతుంటాం. **– రాము, పిండి వంటల తయారీదారుడు, ఓల్డ్ బస్టాండ్ ఏరియా, ఆదిలాబాద్**

నాణ్యత, శుభ్రతను పాటిస్తూ



15 ఏళ్లుగా పిండి వంటలు చేస్తున్నాను. సంక్రాంతి సమయంలో ఆర్డర్లు చాలా ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా సకినాలు, గారెలు, అరిసెలు, గర్జలు మొదలైన వాటి గురించి ఎక్కువ మంది వస్తుంటారు. నాణ్యత, శుభ్రతను పాటిస్తూ రుచికరమైన పిండి వంటలు చేయడంతో గతంతో పోలిస్తే గిరాకీ చాలా పెరిగింది. నాతో పాటు మరికొందరు మహిళలు ఉపాధి పొందుతున్నారు. **– సమంత, పిండి వంటల తయారీదారు, కోలిపురా, ఆదిలాబాద్**

ఉపాధితో పాటు ఆదాయం..



మంచిర్యాలలోని స్వీట్‌హౌజ్ దుకాణంలో లభించే సకినాలు, కారపూసలు ఇతర పిండివంటలను 12ఏళ్లుగా కొనుగోలు చేస్తున్న. ఇంట్లో ఇద్దరం మాత్రమే ఉంటాం. ఒకటి, రెండు కిలో లకు ముకుడు, పెట్టి పిండి వంటలు చేయటం కొంచెం కష్టంగా ఉంటుంది. ఇంట్లో మాదిరిగానే దుకాణాల్లో హోం ఫుడ్స్ లభిస్తుండడంతో అవసరం ఉన్నప్పుడు కొనుగోలు చేస్తున్నాను. **– వెంకటేశ్వరావు, లక్సెట్టిపేట్, మంచిర్యాల**

ఇంట్లో చేసినట్లుగానే రుచి..



మార్కెట్‌లో లభించే హోంఫుడ్స్ ఇంట్లో తయారు చేసినట్లుగా ఉంటున్నాయి. ం నాణ్యతతో పాటు రుచికరమైన పిండివంటలు కావడంతో ఆర్డర్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. తన కుమారుడు అమెరికాలో ఉంటాడు. స్వీట్‌హౌజ్ దుకాణాల్లో కొనుగోలు చేసి ప్రత్యేక ప్యాకింగ్‌తో పంపిస్తుంటాం. ఇంట్లో చేయాలంటే ఎంతో శ్రమతో కూడుకున్నది. సమయం ఆదావుతోంది. **–రాజామారుతి, మంచిర్యాల**

నాణ్యతే నడిపిస్తోంది ..



ఐదేళ్లుగా ఈ స్వగృహ ఫుడ్స్‌ను నిర్వహిస్తున్నాం. రుచికరమైన, నాణ్యమైన పిండివంటలు తయారు చేసి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. శుభకార్యాలకు, పెళ్లిళ్లు, వేడుకలకు, సభలు, సమావేశాలకు ప్రత్యేకంగా తయారు చేసి అందజేస్తున్నాం. దీంతో మాతో పాటు పదిమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. **– విజయలక్ష్మి, శ్రీగాయత్రి స్వగృహ ఫుడ్స్ నిర్వాహకురాలు, నిర్మల్**

పిల్లలూ జాగ్రత్త

- పతంగులు ఎగురవేత విషాదం కారాదు
- తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి





గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు

మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి పండుగంటే చిన్నారులకు పతంగుల సందడే. రోజంతా గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంగా గడిపేస్తుంటారు. పిల్లల అభిరుచికి అనుగుణంగా స్పైడర్‌మాన్, యంగ్రీబర్డ్స్, బెంఎన్, చోటభీం తదితర బొమ్మలతో మార్కెట్‌లో పతంగులు లభిస్తున్నాయి. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చిన్నారులు పతంగులు ఎగురవేయడంపై ఆసక్తి చూపుతున్నారు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లల్లో జోష్ నిండుతుంది. గాలిపటాల ఎగురవేత క్రమంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పతంగులకు వాడే మాంజాతోపాటు ఎగురవేసే క్రమంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలి.. తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. గతంలో మంచిర్యాలలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ వ్యక్తి గాలిపటం దారంతో గొంతు తెగి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. మంజాతో పక్షులు తీవ్ర గాయాల పాలవుతున్నాయి. ఇంకోవైపు ప్రమాదకర ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేస్తుంటారు. పండుగ వేళ విషాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటే పండుగ ప్రశాంతంగా.. ఆనందంగా నిర్వహించుకోవచ్చు.

- శిథిల భవనాలు, రక్షణ గోడలు లేని భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, నీటి ట్యాంకులపై పతంగులు ఎగురవేయకూడదు.
- విద్యుత్ స్తంభాలు, కరెంటు తీగల వద్ద గాలిపటాలు ఎగురవేయడం ప్రమాదకరం.
- సీసీ రోడ్లు, గల్లీల వద్ద మాంజా దారం వేలాడుతూ కనిపిస్తే తొలగించాలి. లేకుంటే వాహనదారులకు గాయాలు అయ్యే పరిస్థితి ఉంటుంది.
- మాంజా దారం తయారీలో వాడే గాజు పొడి మూలంగా గాయాలవుతాయి. పతంగి ఎగురవేస్తున్న క్రమంలో చేతివేళ్లు కోసుకొని పోవచ్చు.
- మేడపై భాగం నుంచి ఎగురవేస్తూ కిందపడే అవకాశం ఉంది.
- పదేళ్లలోపు పిల్లలు మేడలపై పతంగులు ఎగరవేసే సమయంలో పెద్దలు దగ్గరుండి గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి.
- దారం తెగి పతంగులు చెట్లు, విద్యుత్ తీగలకు చిక్కుకున్న సమయంలో ఏమరపాటు ప్రాణాల పైకి తెస్తుంది.
- నిత్యం వాహనాల రద్దీ ఉన్న ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేయకుండా చూసుకోవాలి.
- తెగిన గాలిపటం కోసం పరుగెత్తరాదు. మైదానాలు, పార్కుల్లో గాలిపటాలు ఎగురవేసేలా చర్యలు తీసుకోవాలి.

ఆనందం మాటల్లో చెప్పరానిది



గాలిపటాలు ఎగురవేస్తుంటే ఆనందం మాటల్లో చెప్పరానిది. గాలిలో గిరికీలు కొట్టే పతంగులు మార్కెట్లో లభిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పతంగులు ఎగుర వేస్తుంటాను. డోర్, పేపర్ పతంగిలు కొనుగోలు చేస్తాను. ఆకాశంలో గాలిపటాలు పోటీపడేలా చూస్తాం. తెగిపడిన గాలిపటాల కోసం వెళ్లం. **– అనిరూప్, గౌతమినగర్**

దోస్తులతో కలిసి ఎగురవేస్తాం



దోస్తులందరూ కలిసి గాలిపటాలు ఎగురవేస్తాం. టెట్రా హెడ్రెల్ డిజైన్లు, త్రీ డైమన్షనల్ ఆకారాలతోపాటు ఫైటర్, ఇండోర్, తదితర ఆకృతుల్లో రంగురంగుల్లో నచ్చిన విధంగా గాలిపటాలున్నాయి. కాగితంతో చేసిన గాలిపటం కొనుగోలు చేశాను. ప్రత్యర్థి పతంగిని దారంతో రాపిడి చేయడం ద్వారా తెగిపోయేట్టుప్పుడు చూస్తే సంతోషంగా ఉంటుంది. బిల్డింగ్‌పై ఎగురవేయకుండా జాగ్రత్తగా పతంగిని ఎగురవేస్తాం. **– నవాజ్, మంచిర్యాల**

కాగితం పతంగులు ఎగురవేస్తా.



సంక్రాంతి సెలవులో సంప్రదాయం ప్రకారం కాగితంతో చేసిన గాలిపటాన్ని ఎగురవేస్తాను. ప్రస్తుతం మార్కెట్‌లో ప్లాస్టిక్‌తో చేసినవి కూడా ఉన్నాయి. పక్షులకు హని కల్గించే మాంజాదారం వినియోగించకుండా సాధారణ(కాటన్) దారంతో గాలిపటాలు ఎగురవేస్తాను. **– బోద ఆకాశ్**

బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని జీఎంకు వినతి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న క్లరికల్ సిబ్బంది

రెబ్బెన: బెలంపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న క్లరికల్ సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలని శుక్రవారం గోలేటిలోని బెలంపల్లి రియ జీఎం దేవేందర్‌కు క్లరికల్ సిబ్బంది వినతి పత్రం అందజేశారు. నూతనంగా ఎంపికైన 141 మంది క్లరికల్ అభ్యర్థులతో పాటు గతేడాది నియామితులైన 21మంది క్లరికల్ ఉద్యోగులకు కూడా నిర్వహించాలని, 50శాతం నిబంధన ఎత్తివేసి ఏరియాలోని ఉద్యోగులందరికీ అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఇందులో గద్దం రవీందర్, జిల్లాల రవి, సత్యనారాయణ, రాజ్‌కిరణ్, రజినికుమార్, రాములు ఉన్నారు.

నాటు వైద్యం పేరిట మోసం..

- రూ.12వేలు, సెల్‌ఫోన్‌తో ఉడాయించిన నిందితులు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

జైనథ్: నడుమునొప్పికి నాటు వైద్యం పేరిట జైనథ్ మండలానికి వచ్చిన మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ముగ్గురికి చేదు అనుభవం ఎదురైంది. జైనథ్‌కు చెందిన ఇద్దరిని నమ్మి వైద్యం కోసం రాగా రూ. 12వేలతో పాటు రూ.7వేల విలువ చేసే ఒక ఫోన్ కోల్పోవల్సి వచ్చింది. ఎస్సై పెర్సిస్ బిట్ల వివరాల ప్రకారం... నాందేడ్‌కు చెందిన పెయింటర్ జ్ఞానేశ్వర్ ఇటీవలే ప్రమాదవశాత్తు కిందపడడంతో నడుము భాగంలో దెబ్బ తగిలింది. అప్పటి నుంచి తీవ్ర నడుము నొప్పితో బాధపడుతున్నాడు. నడవలేని పరిస్థితికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో జైనథ్ మండల కేంద్రానికి చెందిన మురళి ఈశ్వర్ తన వద్ద నడుము నొప్పికి నాటుమందు ఉందని చెప్పాడు. దీంతో నాందేడ్‌కు చెందిన పెయింటర్ జ్ఞానేశ్వర్ గురువారం మరో ఇద్దరితో కలిసి బైక్‌పై వచ్చి, మురళీ ఈశ్వర్‌కు ఫోన్ చేశాడు.తాను అందుబాటులో లేనని, పక్క గ్రామమైన దీపాయిగూడకు చెందిన సునీల్ రెడ్డిని కలువాలని చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చాడు. దీంతో వారు సునీల్ రెడ్డిని కలవగా, మందు కోసం రూ.12వేలు కావాలని అడగడంతో ఇచ్చేశారు. అయితే తనతో ఒకరే బైక్‌పై రావాలని చెప్పి జ్ఞానేశ్వర్‌తో వచ్చిన ఒక వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకొని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్దకు తీసుకెళ్లాడు. అతడి వద్ద ఉన్న రూ.7వేల విలువ చేసే సెల్ ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీంతో బాధితులు మురళి ఈశ్వర్, సునీల్‌రెడ్డికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచాఫ్ రావడంతో చేసేదిలేక శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అయితే అసలు మహారాష్ట్రకు చెందిన ముగ్గురు జైనథ్‌కు చెందిన వ్యక్తులను ఎలా నమ్మారు? ఎందుకు గుడ్డిగా రూ.12వేలు ఇచ్చారు? అసలు వీరి మధ్య ఇంకా ఏమైన ఉందా? అసలు ఏం జరిగింది అనేది ఇంకా స్పష్టత రాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

రెంజర్ల రాజేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

మంచిర్యాలక్రైం: సరస్వతి దేవిపై, హిందూ దేవతలపై అసభ్యకర పదజాలంతో మాట్లాడిన రెంజర్ల రాజేశ్‌పై పీడి యాక్ట్ నమోదు చే యాలని డిమాండ్ చేస్తూ ఆర్ఎస్ఎస్ నాయకులు శుక్రవారం ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు వహోకుమార్, ధర్మ జాగరణ కర్ణకంటి రవీందర్, రజనీష్‌జైన్, బోయిని హరికృష్ణ, అచ్చ మల్లేష్, పిట్టల నిఖిల్, రామగిరి శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 29 పశువులను పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేపడుతున్న సమయంలో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా పశువులను తరలిస్తున్న లారీని తనిఖీ చేయగా 29 పశువులను గుర్తించారు. అప్పటికే అందులోని రెండు ఆవులు, మూడు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఈ మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు.

రాంటెక్ వాసి విజయవాడలో ఆత్మహత్య

ముథోల్: మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన మరకంటి రాజు(30) విజయవాడలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజు తన భార్య మాదవితో పదేళ్లుగా కూలీ పని చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల వారికి కుమారుడు జన్మించాడు. అయితే కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగు లేకపోవడంతో ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి శుక్రవారం విజయవాడలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.